20

# చివరి దినము

## మత్తయి 26:45-27:66 మరియు సమాంతర లేఖన భాగాలు

**పరిచయం.** – యేసు జీవితం కంటె ఆయన మరణాన్నే అధికంగా ప్రవచిస్తాం. ఆ భావం మీదే యాంత్రికంగా కాలం గడుస్తోంది. యేసు జీవితంలో అత్యున్నతమైన సిలువ అనే సంగతి ఇందులో సహజమైనదిగా మిగిలిపోతోంది. అయినా బైబిల్లో యింకా ఏ యితర దినపు చర్యలు యింత విపులంగా చెప్పబడలేదు. ప్రభువైన యేసు జీవితమంతా సంపూర్ణంగా చెప్పబడియున్నట్టయితే, క్రొత్త నిబంధన సంపూర్తిగా ఎంత ఉందో అలాటివి 400 పుస్తకములైయుండేవి.

**1. అప్పగించడం.** – ప్రభువైన యేసు ప్రార్థిస్తూ ఉండగా, ఆ ముగ్గురు శిష్యులు నిద్రపోయారు. యూదా అలా లేదు. ఆయన తన ఏర్పాటును పరిపూర్ణం చేసికొనడంలో నిమగ్నమైయున్నారు. తన విజ్ఞాపనలనుండి ప్రభువు లేచి తన శిష్యుల వద్దకు రాగా, కత్తులతోను గుదియలతోను కాగడాలతోను యూదా సైనికులతో కూడిన గుంపుతో తోటలోనికి ప్రవేశించాడు. ఆ మనుష్యులకు ప్రభువైన యేసు ఎవరో తెలియదు; అయితే, ఏ తప్పు జరుగకుండేలా, "బోధకుడా, నీకు శుభము" (మత్తయి 26:49, మార్కు 14:45; లూకా 22:47లను కూడా చూడు) అని చెప్పి ఆయనను ముద్దు పెట్టుకుంటానని గుర్తు చెప్పాడు; గలిలయలోని మహా గొప్ప ప్రవక్త ఎదుట కూలికి వచ్చినట్టు ఆ జనం మొదట వెనుకకు పడిపోయారు; కడకు ధైర్యం తెచ్చుకొని, ఆయనను పట్టుకొని, బంధించి తీసికొనిపోయారు. దానినంతటిని పేతురు సహించలేకపోయాడు, తన ఖడ్గంనుండి గురి తప్పిన దెబ్బ ప్రధాన యాజకుని పనివాడి చెవిని తుంచివేసింది. ఖడ్గాలు అవి స్నేహితులవైనా శత్రువులవైనా పనికి రావు, అవసరంలేదు. తన స్వాధీనంలో ఉన్న శక్తులను ఆయన వినియోగించు కొనడానికి యిష్టపడియుంటే, ఆయన శత్రువులు నిలువ గలిగేవారే కారు, మరియు యూదుల ద్వేషానికిని, స్థిరపరచుకున్న తన సొంత ఉద్దేశం నెరవేర్చుకొనడానికిని తన పక్షంగా స్నేహితులు వాటిని ఉపయోగించకూడదు. దైవ ప్రేమ, అపవాదికున్న ద్వేషము, గంభీరమైన దేవుని ఉద్దేశాలు, మానవుల నీచమైన భావాలు అన్ని కలిసి మిళితమై సిలువను చుట్టుకున్నాయి.

**2. తీర్పులు.** – తాము జయించిన జనాలను విడిచి పెట్టినట్టే రోమీయులు యూదులకు ఎక్కువ స్వాతంత్ర్యాన్ని యిచ్చారు. నెమ్మదిగా ఉండి, పన్నులు చెల్లించునంత కాలము స్థానిక విషయాలను తమకు యిష్టమైన మార్గంలో నడిపించుకోవచ్చు. అయితే

చెరసాలలో ఉన్న ఒకనికి మరణ శిక్ష విధించడానికి వారి జాతీయ సభ తీర్మానించినట్లయితే, దాన్ని రోమా కోర్టు యెదుటికి తేవాలి. ఆ విధంగా ప్రభువైన యేసుకు రెండు రకాలైన తీర్పులు జరిగాయి: యూదుల లేక మత సంబంధమైనది ఒకటి, మరియు రోమీయుల లేక పౌర సంబంధమైనది మరొకటి. ప్రతి తీర్పులోను మూడు మెట్లున్నాయి.

**ఎ. యూదుల లేక మత సంబంధమైన తీర్పు.** – (1) మొదటిది అన్న ఎదుట ప్రారంభ పరిశీలన. చాల సంవత్సరాల క్రితం అన్నా ప్రధాన యాజకుడుగా ఉన్నాడు, మాజీ ప్రధాన యాజకుడుగా అతడు యింకా గౌరవించబడుతునే ఉన్నాడు. అతడు చాలా వృద్ధుడు, గొప్ప పలుకుబడి గలవాడు. కొన్ని ప్రశ్నలు వేసిన తరువాత ప్రభువైన యేసును అన్న కయపయొద్దకు పంపాడు; కాని మొదటి క్రూరమైన దెబ్బ పడక ముందు కాదు. (2) రెండవ దశ కయప ఎదుట, మరియు యిది అధిక ప్రాముఖ్యమైనది. కయప అన్నాకు అల్లుడు, అప్పుడు ప్రధాన యాజకుడుగా ఉన్నవాడు; గనుక సన్‌హెడ్రిన్ సభకు ప్రసిడెంటైయుంటాడు. సూర్యోదయానికి ముందు సన్‌హెడ్రిన్ యొక్క ఏ మీటింగైనా చట్ట విరుద్ధమైనదే; జనుల మధ్య అల్లరి కలుగక ముందు ప్రభువైన యేసును దోషియని తీర్చడానికి నాయకులు అందుబాటులో ఉన్నారు. రుజువు చేయగల నేరాలు కొనిరావడం కష్టమైపోయింది. నమ్మదగని కొన్ని అపనిందలు ఆయన మీద మోపబడ్డాయి. అయితే సాక్ష్యాలు ఒకదానితో నొకటికి పొత్తు కుదరలేదు, మరియు ప్రభువు హుందాతో నిశ్శబ్దంగా ఉండిపోయారు. తీర్పు పతనమయ్యే అపాయంలోనికి దిగజారింది; కయప తన్ను తానే నేరస్థునిగా చేసికోబోయాడు – "పరమాత్ముని కుమారుడవైన క్రీస్తువు నీవేనా?" (మార్కు 14:61; మత్తయి 26:63; లూకా 22:67లను కూడా చూడు) అని అడిగినప్పుడు, ప్రభువు అంతకు ముందు మౌనంగానే ఉండిపోయారు. ఈ ప్రశ్నకు మాత్రం ఆయన మౌనంగా ఉండలేక, "అవును నేనే" యని అన్నారు (మార్కు 14:62; మత్తయి 26:64ను కూడా చూడు). "దేవదూషణ" యని కయప కేకవేశాడు. "ఆయన మరణమునకు పాత్రుడు" (మత్తయి 26:66; మార్కు 14:64 ను చూడు) వ్యతిరేకులైయున్న న్యాయాధిపతులు ప్రతిధ్వనించారు. మధ్యరాత్రి అయిన వెంటనే వారు ప్రభువును బంధించారు. సూర్యోదయానికి యింకా సమయముంది, సన్‌హెడ్రిన్ యొక్క పూర్ణమైన మీటింగుకు ముందు ఎదురాడని ఖైదీని క్రూరమైన హేళనకు గురి చేశారు. (3) మూడవ దశ – సంపూర్ణ సభయెదుట – అంతకు ముందు తీసికున్న నిర్ణయానికి ఆమోదం పొందటమే.

ముందు దశలలో ఎప్పుడో పేతురు పడిపోవడం జరిగింది. యోహానుతో కలిసి అతడు తమ బోధకుని వెంటాడుతునే వచ్చాడు, జరుగుతున్న కార్యక్రమాలను చూస్తున్నాడు. అది అపాయకరమైన గ్రౌండ్; భయోత్పాతానికి లోబడి, తాను గలిలయుడని ఒకరిద్దరు పరిహాసంగా అతణ్ణి చూపేటప్పటికి, తన ప్రభువును అతడు ముమ్మారు ఎరుగనన్నాడు, వాటితో అతడు ఒట్టుకూడా పెట్టుకున్నాడు. పాపం పేతురు! కాని అతడు నిరీక్షణ లేకుండునట్టు నశించిపోలేదు. కోడి కూయడం, ప్రభువు ముందుగా చెప్పినది జ్ఞాపకం రావడం, సగర్వంగా అతడు అతిశయించి మాట్లాడడం, కయిప భవనానికి ఆయన అతన్ని దాటి వెళ్లేటప్పుడు ఆయన అతని వైపు చూచిన మౌనపు చూపు, దుఃఖకరమైన వ్యక్తిత్వానికి కారణమయ్యాయి; "అతడు వెలుపలికి పోయి ఏడ్చెను." (మత్తయి 26:75).

దీనికంటే దుఃఖకరమైన, చాలా భయంకరమైనది మరొక ప్రక్క ఉంది. యూదా కూడా జరుగుతున్న కార్యకలాపాలమీద కన్ను వేసియున్నాడు. ప్రభువైన యేసు తన సంకెళ్లు తెంపుకొని తన మహిమను కనుపరచుకొంటాడని అతడు నిరీక్షించియుండవచ్చు. తాను ముప్ఫై వెండినాణ్యాలున్న ధనవంతుడౌతూ ఉండగా, తన బోధకునికి ఏ హాని సంభవించదని తలచియుండవచ్చు. యూదుల తీర్పులోని మూడు దశలు ముగిసాయి. యేసుకు మరణ శిక్ష విధింపబడింది. కేవలం పిలాతు చివరి మాటే అవసరం. తప్పును తెలిసికొనుటచే ఏర్పడే దుఃఖము యూదాను పట్టుకొంది. ఆ ముప్ఫై వెండి నాణ్యాలు అతని అంతరంగాన్ని దగ్ధం చేస్తున్నాయి "నిరపరాధి రక్తాన్ని అప్పగించానని" (మత్తయి 27:4) ఆ సభవారి ఎదుటికి వెళ్లి విసరి వేశాడు. "అది నీకు సంబంధించింది, మాకు సంబంధించినది కాదని" హృదయంలేని జవాబు ఎదురయ్యింది. సాధనంగా తాను ఉపయోగింపబడిన వారిచేత ద్రోహి ఎల్లప్పుడు తృణీకరింపబడతాడు. మరియు అతడు వెలుపలికి పోయి ఉరిపోసికొని చచ్చాడు (మత్తయి 27:5; అపొ. 1:18, 19). అప్పటికైనా, అతడు ప్రభువైన యేసు పాదముల మీద పడి, క్షమాపణ అనే దీవెన ఎందుకు పొందకూడదు? తప్పు చేసేనను భావం పశ్చాత్తాపం కాదు. యూదా ఒక దానికి పేతురు మరొక దానికి నిలిచియున్నారు.

**బి. రోమీయుల లేక పురజన సంబంధమైన తీర్పు.** - ఇక్కడ కూడా, మూడు దశలుంటాయి. (1) పిలాతు ఎదుట. పిలాతు యొక్క తొలి ప్రశ్న: "నేర మేమి?" దేవదూషణ అనే నేరం మీద తీర్పు తీర్చడం రోమా కోర్టు ముందు చెల్లదు. దుష్టత్వం చేశాడని తేటపడని నేరాలతో పిలాతుచే మరణ దండన సంపాదించడానికి ప్రయత్నించారు; కాని రోమీయుల దృష్టిలో న్యాయ తీర్పునకు స్పష్టమైన నేరాలు కావాలి. "కైసరునకు పన్నియ్య వద్దనియు, తానే క్రీస్తు అను ఒక రాజుననియు చెప్పగా మేము వింటిమి" అని వారన్నారు ( లూకా 23:2). మొదటిది అబద్ధం; రాజకీయ భావంతో ప్రభువు అపాయకరమైన ఏ రాజరికాన్ని కోరలేదన్న విషయంలో పిలాతు వెంటనే సంతృప్తి చెంది, ఆయన నిర్దోషియని అతడు ప్రకటించాడు. దానితో వారు వదలుకోలేదు. గలిలయ మొదలుకొని యెరూషలేము వరకు తిరుగుబాటును రేపుతున్నాడని మరల నేరం మోపారు. పిలాతు సందిగ్ధంలో పడ్డాడు. నిర్దోషియైనవానికి శిక్ష విధించడం అతనికి యిష్టంలేక పోయింది; అయితే యూదులను అభ్యంతర పరుస్తానేమోయని అతడు ఆలోచిస్తున్నాడు. గలిలయ అనే మాట అతనికి చిక్కింది. అది హేరోదు యొక్క పాలనా ప్రాంతం; హేరోదు పట్టణంలో ఉన్నాడు; యిద్దరు అధిపతుల మధ్య వైరుధ్యముంది; హేరోదుకు మర్యాద చూపి తగవును పోగొట్టుకునే అరుదైన అవకాశం, మరియు అనంగీకారంగా ఉన్న అపాయకరమైన కేసును కూడా తొలగించుకోవాలనే ఆలోచన కుదిరింది. గనుక పిలాతు ప్రభువైన యేసును హేరోదు వద్దకు పంపుతాడు. (2) హేరోదు ఎదుట. ఏదో యొక అద్భుతం చూడగోరినవాడై ప్రభువైన యేసును కలిసికోవాలని హేరోదు ఆతురత కలిగియున్నాడు. పందుల ముందు ముత్యాలు వేయకూడదనే తన సొంత భావాలకు కట్టుబడినవాడై, హేరోదు ప్రశ్నలలో దేనికిని ఒక్క మాటయైనను ఆయన ఉత్తరమియ్యలేదు. అప్పుడు రెండవ హేళన తటస్థించింది. పూర్ణంగా విఫలమైన హేరోదు క్రూరులైన తన సిపాయిలతో పాత రాజ

వస్త్రాన్ని ధరింపజేసి, తిరిగి ఆయనను పిలాతు వద్దకే పంపాడు. (3) మరల పిలాతు ఎదుట. ఈ సమయానికి ఖైదీ నొకని విడిపించుకొనగోరి, పస్కా సంవత్సర ధర్మం కొరకు జనాలు పోగవ్వడం అధికమౌతుంది. ప్రభువైన యేసును విడుదల చేయాలని పిలాతు ప్రతిపాదించాడు. అయితే యాజకులు జనులతో బిజీగా ఉండిపోయారు. విజయోత్సవపు ఊరేగింపుకు ముందు వాహనముపై పట్టణంలోనికి ప్రవేశించిన యేసు, సన్‌హెడ్రిన్‌చే శిక్ష విధింపబడడానికి తీర్మానింపబడిన యేసు, పిలాతు ఎదుట తీర్పుకై నిలిచి ఉన్నారు. "అయితే వారు – వీనిని వద్దు, బరబ్బను విడుదల చేయుమని కేకలు వేసిరి. ఈ బరబ్బ బందిపోటు దొంగ" (యోహాను 18:40; మత్తయి 27:20; మార్కు 15:11; లూకా 28:18లను కూడా చూడు). కొంతసేపు జనసమూహముతోను (అల్లరి మూకతోను), తన సొంత మనస్సాక్షితోను పెనుగులాడినవాడై, వారికి లోబడి, ప్రభువైన యేసును సిలువ వేయ నాజ్ఞాపించాడు. ఖాళీ సమయంలో పిలాతు సైనికులు తమ జీవితంలో ఆయనను అపహసించి, ఎర్రని అంగీని తొడిగి, తలకు ముండ్ల కిరీటము పెట్టి, చేతికి రెల్లునిచ్చారు.

ఈ విధంగా ఆ ఆరు విధాలైన తీర్పు, ద్రోహము, వేషధారణ, పిరికితనము, స్వార్థపరమైన విధానము, జంతు సంబంధమైన క్రూరత్వము – అనేవి, అత్యుత్తమమైన యేసు వ్యక్తిత్వానికి విరుద్ధంగా నిలిచియున్నాయి. అక్కడి కక్కడే, హాస్యాస్పదమైన రాజరికపు వస్త్రాలను ధరింపజేయబడినవాడై హద్దులు లేని మూక పరిహాసాన్ని, అవమానాన్ని భరించుతూ కూడా, హేరోదు సింహాసనమందు ఆసీనులైన వేయిమంది రాజులకంటెను, లేక కైసరుయొక్క కిరీటం ధరించిన వారికంటెను అధికుడైన రాజుగా ఉన్నాడు.

**3. సిలువ.** – **ఎ. సమయము, స్థలము.** – ఆయనను సిలువ వేయుమని ఆజ్ఞాపించినది ఉదయం తొమ్మిది గంటల సమయం. ప్రభువు గవిని వెలుపల శ్రమ పొందారు (హెబ్రీ. 13:12), ఆ స్థలాన్ని హెబ్రీలో, గొల్గొతా అనియు; గ్రీకులో, క్రేనియన్ అనియు; లాటిన్‌లో, కల్వారియం (కల్వరి) అనియు పిలుస్తారు – వీటన్నిటికి "కపాలము" అని అర్థం. అది పట్టణానికి వాయవ్యంగా ఉన్న కపాలపు ఆకారము వంటి కొండ (శిఖరమై) యుండవచ్చు.

**బి. మార్గంలో.** – ప్రభువు తన సొంత సిలువను మోసికొని వెళ్లుతున్నారు; గొల్గతాకు చేరకముందు కురేనియుడైన ఒక యువకుని పట్టుకొని, సైనికులు సిలువను అతనిపై నుంచారు, రాత్రి నిద్రలేక పోవడంతోను, ఉదయం అనుభవించిన బాధలతోను ఆయన దేహము అలసినదై ఆ బరువు మోయలేక పోయినందున వారట్లుచేసియుండవచ్చు. అంతటి అంధకారమైన గడియలో కొందరు దుఃఖించుట ఆయన తిలకించారు. అవమానము మధ్య మౌనముగానున్న ఆయన పెదవులు, కరుణతో విచ్చుకున్నాయి; అయినా అవి తన కొరకు కాదు, యెరూషలేముపై రానున్న ఉపద్రవంలో చిక్కుబడిపోయే వారికొరకు.

**సి. సిలువ యొద్ద.** – ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడా సిలువ వేయబడ్డారు. హీనులైన నేరస్థులను రోమీయులు చంపే విధానం సిలువ వేయడం. దయతో కూడినవారై, యెరూషలేము స్త్రీలు, అట్టి సందర్భాలకొరకు స్మృతి తప్పించే పానీయం తయారు చేయుట కద్దు. అలాటి చిరక ఆయనకు అందింపబడింది; కాని

ప్రభువు బాధను తక్కువ చేసికొనడానికి తన శక్తులకు మత్తు కలిగించుకొనడానికి నిరాకరించారు.

**డి. సిలువపైనుండి ఏడు మాటలు.** - సిలువపైనుండి ప్రభువు పలికిన ఆ ఏడు మాటలు రికార్డు చేయబడ్డాయి: (1) వాటిలో మొదటిది ఈ గడియలో పలికియుండవచ్చు. దేహం మొదట సిలువకు కొట్టబడింది, తరువాత మొరటుగా అది దానికై త్రవ్వబడిన గోతిలో పెట్టబడింది. మొరటైన (సిపాయిలు) రాణువవారు లేక సైనికులు యిది జరిగిన కొద్ది సమయానికి కూర్చుని ఆయన వస్త్రాల కొరకు చీట్లు వేసుకొనసాగారు. వారిని ఉద్దేశించి, "తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను" (లూకా 23:34); కక్ష సాధించు వారి మీద పిలాతు కొన్ని నిందలను సిద్ధపరచాడు. "నజరేయుడగు యేసు యూదుల రాజు" (యోహాను 19:19; మత్తయి 27:37; మార్కు 15:26; లూకా 23:38) అని ఆయనను గూర్చి హెబ్రీ, గ్రీకు, లాటిన్ భాషల్లో వ్రాసింది, పిలాతు తమపై విసరి వేసినట్లు యూదులు భావించారు. వారు దానికి నిరసన తెలిపారు, గాని ప్రయోజనం లేకుండా పోయింది. (2) యేసు తల్లియు, మరి యిద్దరు మరియలును సిలువచెంత యోహానుతో కూడా నిలిచియున్నారు. తన తల్లికిని యోహానుకును ఆయన తన రెండవ పలుకును ఉద్దేశించారు: "అమ్మా, యిదిగో నీ కుమారుడు" అని తన తల్లితో చెప్పారు."ఇదిగో నీ తల్లి" (యోహాను 19:26, 27) అని యోహానుతో చెప్పారు; తన విషయమై గాక యిరతుల విషయమై శ్రద్ధకలిగి ఆయన యిలా అన్నారు. (3) అంతవరకు ఉగ్గబట్టిన పగకున్న బలహీనత అధికారులలోనుండి విరుచుకుపడ నారంభించింది. ప్రధాన యాజకులు, శాస్త్రులు, అధికారులు దేశనాయకులు ఏకమై, "- వీడు ఇతరులను రక్షించెను, తన్ను తానే రక్షించుకొనలేడు" (మత్తయి 27:42; మార్కు 15:31; లూకా 23:35) అంటూ పరిహాసం చేయడంలో అల్లరి మూకతో కలిసిపోయారు కాని, అది వారు కనగల కలకంటే లోతైన సత్యమైయున్నట్టు వారు ఎరుగలేకపోయారు: ఆయన యితరులను రక్షించేవాడైయున్నప్పుడు తన్ను తాను ఎలా రక్షించుకో గలుగుతాడు? నీచులైన దొంగలిద్దరు మొదటిలో హేళన చేసేవారితో కలిసిపోయారు. వారిలో ఒకడు నిర్దోషమైన బాధపట్ల దయగలిగి, మారుమనస్సుతో తాకబడేవరకు అలా జరిగింది. అప్పుడతడు ప్రార్థనతో మధ్యనున్న సిలువ వైపునకు తిరిగి, "నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమని" (లూకా 23:42) విన్నవించుకొన్నాడు. తన నామమునకును తాను వచ్చిన పనికిని కడవరకు నమ్మకముగా ఉన్న ప్రభువు, "నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువు" (లూకా 23:43) అని సెలవిచ్చారు. (4) అప్పుడు, పన్నెండునుండి మూడు గంటలసేపు, చీకటియు, నిశ్శబ్దమును వెంబడించాయి. అది సాయంకాలపు బలి అర్పించే సమయం, చీకటిలోనుండి సిలువపైనుండి ఓర్పుగల పెదవులలోనుండి మొదటి సారిగాను చివరిగాను పరలోకానికి ఫిర్యాదు చేస్తూ, "నా దేవా, నా దేవా, నన్నెందుకు చెయ్యి విడిచితివనే" (మత్తయి 27:46; మార్కు 14:34) వింతైన మాటలు బయలువెళ్లాయి. త్వరలోనే మిగిలిన పలుకులు వచ్చాయి: (5) "నేను దప్పిగొనుచున్నాననెను" ( యోహాను 19:28). శరీరపు బాధ మొదటిగాను చివరిగాను వ్యక్తపరచబడింది. భక్తిపూర్వకమైన భయము కఠిన హృదయాలను మెత్తన చేసింది. చిరకతో నిండియున్న యొక పాత్ర

ఆయన కియ్యబడింది, ప్రభువు ఆ చిరక పుచ్చుకొని. (6) మరోసారి మాట్లాడారు: "సమాప్తమైనదని" (యోహాను 19:30), అది కేవలం అంతమయ్యింది కాదు, సమాప్త మయ్యింది సుమీ. భూమిమీద జీవించిన వారందరిలో మహా గంభీరమైన జీవితం అంతమగుట మాత్రమేకాదు; మానవ విమోచనా కార్యము సమాప్తమైనది; పితరులును ప్రవక్తలును కలగన్న వాటికంటే మిన్నగా పాత నిబంధన ప్రవచనాలును, అలంకార ములును నెరవేర్చబడి సమాప్తి చేయబడ్డాయి. (7) అప్పుడు, తన శిరము వంచి, సిలువ మీదనుండి చివరి పలుకుగా తన ఆత్మను అప్పగించుతూ, "తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొను చున్నాననెను" (లూకా 23:46).

**ఇ. పాత నిబంధన అంతమయ్యింది.** – తన మరణపు కేక సమయంలో దేశము భూకంపపు షాకు తిన్నది. దేవాలయపు తెర పైనుండి క్రిందికి చినిగింది, ఎందుకంటే, ప్రభువైన యేసు సిలువ పాత నిబంధన మాదిరులతోను నీడలతోను అంతరింప జేసినట్టు గురుతు పెట్టింది (కొలస్సీ. 2:14). మనుష్యులు భక్తితో కూడిన భయంతో నింపబడ్డారు. నిజముగా "ఈయన దేవుని కుమారుడని" (మత్తయి 27:54; మార్కు 15:39) రోమా శతాధిపతి చెప్ప బలవంత పెట్టబడ్డాడు.

**4. సమాధి.** – సిలువను వెంబడించిన దినము మహా విశ్రాంతి. యూదులు నరహత్య చేయగలరు గాని; ఆచారమును బట్టివారు సబ్బాతు దినాన్ని అపవిత్రపరచలేరు; సూర్యాస్తమయమైన తరువాత శరీరాలను సిలువ మీద ఉంచకూడదు. వారి మరణం తొందర పెట్టడానికిగాను వారి కాళ్లు విరుగగొట్టబడ్డాయి; అయితే ప్రభువైన యేసు అంతకుముందే చనిపోయారు, సైనికుడు బల్లెముతో ఆయన ప్రక్కలో పొడిచిన దానియందు అది కనుపరచబడింది. రెండు ప్రవచనాలు అనాలోచనగానే అందు నెరవేర్చబడ్డాయి (కీర్తన. 34:20; 22:16, 17). ప్రభువు దేహం ఆయన శిష్యులలో అరిమత్తయి యోసేపు, నీకొదేము అనే యిద్దరి చేతికి అప్పగింపబడి; యోసేపు క్రొత్త సమాధిలో ఉంచడానికి ప్రేమగల చేతులతో ఆయన దేహము సిద్ధపరచబడింది; భయపడిన యూదుల విన్నపంతో రోమా ముద్ర, రోమా సైనికుల కావలితో సమాధి భద్రం చేయబడింది.